క్లుప్తంగా

విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు



దేశభక్తి గీతాలు ఆలపిస్తున్న దృశ్యం

మునగపాక : దేశభక్తి గీతాలాపన ద్వారా మానసిక వికాసం పెరుగుతుందని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శివకోటి దుర్గాప్రసాద్ అన్నారు.వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా మునగపాక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి ఎల్‌వీ రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పిల్లా జగదీష్, బీడీసీ నిర్వాహకుడు కేవీఎస్ అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి పండగ



సత్తెమ్మతల్లిని దర్శించుకుంటున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక : మునగపాకలో పలు చోట్ల ఆదివారం సత్తెమ్మతల్లి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. చెరువు కాలువ సంఘం అలాగే ములబందగోడీ ప్రాంతాల్లో సత్తెమ్మతల్లి పండగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. మహిళలు ఊరేగింపుగా ఆలయాలకు చేరుకొని అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. దీనిలో భాగంగా ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ సత్తెమ్మతల్లిని దర్శించుకొని పూజలు చేశారు.

వైఎస్సార్‌సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడి మృతి



ధనిశెట్టి కృష్ణ

పాయకరావుపేట : వైఎస్సార్‌సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి కృష్ణ (46) అనారోగ్యంతో మృతి చెందారు. పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావుకి సోదరుడు. కృష్ణ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారం రోజుల నుంచి విశాఖపట్నం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ధనిశెట్టి కృష్ణ మృతి చెందడం పట్ల పలువురు పార్టీ నాయకులు, అభిమానులు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కృష్ణకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

దిమిలిలో వేసవి విజ్ఞాన శిబిరం



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతుంది. ఆదివారం విద్యార్థులకు పుస్తక పఠనంపై తర్ఫీదునిచ్చారు. నీతి కథలు చెప్పారు. భక్తి గీతాలు నేర్పించారు. డాన్స్ నేర్పించారు. లైబ్రేరియన్ ఎస్. శకుంతల, రీసోర్స్‌పర్సన్ శానాపతి అప్పారావు పాల్గొన్నారు.

పాములవాకలో 'గడప గడపకు' నేడు

కోటవురట్ల : పాములవాక గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 6.30 గంటలకు ప్రారంభమవుతుందని, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. అధికారులు ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు విధిగా హాజరు కావాలని సూచించారు.

వర్షపు జల్లులతో ఉపశమనం



యలమంచిలిలో కురుస్తున్న వర్షం

యలమంచిలి : నాలుగు రోజుల నుంచి తీవ్ర ఉష్ణోగ్రత, వడగాడ్పులతో సతమతమౌతున్న యలమంచిలి ప్రజలు అకాల వర్షంతో కొంత మేర ఉపశమనం పొందారు. ఆదివారం మధ్యాహ్నం సుమారు 2గంటల నుంచి వాతావరణం చల్లబడి ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షపు జల్లులు కురిశాయి. వర్షం కురవడంతో అప్పటివరకు ఉక్కపోతతో అలమటించిన ప్రజలు ఒక్కసారిగా కొంత మేర ఉపశమనం చెందారు. రైతులకు వేసవి దుక్కులకు కొంత మేర ఉపయోగపడనుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. యలమంచిలి మున్సిపాలిటీ పెదగొల్లల పాలెం గ్రామంలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడి దగ్ధమైంది. చిన్నపాటి వర్షం కురవడంతో పట్టణంలో రోడ్లు బురదమయిమయ్యాయి.

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి తేలికపాటి వర్షం పడింది. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు భానుడు భగభగలు, ఉక్కబోత, వడగాడ్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో చినుకులు ప్రారంభమయ్యాయి. అయితే తేలికపాటి వర్షం మాత్రమే పడింది. వాతావరణం మాత్రం చల్లబడింది.

ఈదురుగాలుల బీభత్సం

కోటవురట్ల: మండలంలో ఆదివారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రతతో జనం అల్లాడిపోగా సాయంత్రం ఒక్కసారిగా మారిన వాతావరణంతో చల్లదనాన్ని ఆస్వాదించారు. అదే సమయంలో వర్షంతో పాటు ఈదురు గాలులు, పిడుగులు హడలెత్తించాయి. జనావాసాలలో కొబ్బరిచెట్లపై పిడుగులు పడడంతో స్థానికులు భయాందోళన చెందారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

హైకోర్టు న్యాయవాదికి ఘన సన్మానం



న్యాయవాది వంకా నారాయణరావును సన్మానిస్తున్న నాయకులు

పాయకరావుపేట : పట్టణానికి చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది వంకా నారాయణరావుకు హైమా నేత్రాలయం ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆదివారం ఘన సన్మానం చేశారు. సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, ఏపీ పట్టణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ మాట్లాడుతూ న్యాయవాది నారాయణరావు సామాజిక ధృక్పథం కలిగిన వ్యక్తిగా ప్రజా సమస్యలకు సంబంధించిన కేసులు తీసుకుని ప్రజలకు మేలు చేస్తున్నారన్నారు. ఎంతో మంది నిరుపేదలకు హైకోర్టులో న్యాయం జరిగే విధంగా ఆయన కృషి చేసారని కొనియాడారు. హైమా నేత్రాలయం ఆధ్వర్యంలో ఇటువంటి మంచి కార్యక్రమాలు చేయడం ఎంతో గర్వకారణమన్నారు.

హైమా నేత్రాలయంలో ఆరోగ్య శ్రీ ద్వారా రోగులకు వైద్య సేవలు అందించడం ఎంతో మంచి కార్యక్రమం అన్నారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత హైకోర్టు న్యాయవాది నారాయణరావు మాట్లాడుతూ తనను గౌరవించి, సన్మానించిన హైమా నేత్రాలయం వైద్యులు ప్రసాద్‌కు, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, కాంగ్రెసు పార్టీ అధికార ప్రతినిధి జగతా శ్రీను, పాండురంగ దేవస్థానం మాజీ చైర్మన్ యాళ్ళ వరహాలు, అడపా ప్రకాష్, వంకా శ్రీను, మామిడి వెంకటేశ్వరరావు, జి.వి.వి.సత్యనారాయణ, డాక్టర్ మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర కౌలురైతు రక్షణ యాత్రను విజయవంతం చేయాలి



కౌలురైతుల రక్షణ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మునగపాక:రాష్ట్ర కౌలు రైతుల రక్షణ యాత్రను విజయవంతం చేయాలని కౌలురైతు సంఘ జిల్లా అధ్యక్షులు కాండ్రేగుల రాము కోరారు. ఇందుకు సంబందించిన పోస్టర్‌ను ఆదివారం మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కౌలురైతులకు న్యాయం చేయడం లేదన్నారు.కౌలురైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు.కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. సోమవారం మునగపాక నుంచి రక్షణయాత్ర ప్రారంభమవుతుందని, కౌలురైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు ఈ యాత్రను ప్రారంభిస్తారని అన్నారు. ఈ యాత్ర అనకాపల్లి నుంచి అమరావతి వరకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకులు ఆళ్ల మహేశ్వరరావు,రైతు సంఘ నాయకులు టిక్కలి జగ్గారావు,సీఐటీయూ నేతలు వి.వి.శ్రీనివాసరావు, బ్రహ్మాజీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

గులివిందమ్మ అమ్మవారి జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఎస్.రాయవరం: పెనుగొల్లు గ్రామంలో గులివిందమ్మ తల్లి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి వేకువజాము నుంచి పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. రైతులు, మహిళలు ఆచార సంప్రదాయాలతో మొక్కులు చెల్లించుకొని అమ్మవారి చీరె, సారె సమర్పించుకున్నారు. రైతులు వారి వ్యవసాయ ఉత్పత్తులు అమ్మవారికి నివేదించారు. ఆలయం వద్ద రాత్రి ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకుంటున్న విజ్ఞాన శిబిరాలు



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కోటవురట్ల : వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులను ఆకట్టుకుంటున్నాయి. పలు పోటీలలో ఉత్సాహంగా పాల్గొని వివిధ అంశాల పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో విద్యార్థులతో పుస్తక పఠనం, కథలు చెప్పడం సాధన చేయించారు. ఉపాధ్యాయుడు మస్తాన్ రీసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు.

పడమటమ్మలోవలో పౌర్ణమి హోమాలు

కశింకోట : మండలంలోని విసన్నపేట పడమటమ్మలోవలో ఆదివారం పౌర్ణమి పురస్కరించుకుని హోమాలు నిర్వహించారు. వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా పూజా ద్రవ్యాలతో హోమం చేశారు. గురువు పెనుమటి సాంబమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి, హోమంలో పాల్గొని పడమటమ్మ వారిని దర్శించుకున్నారు.

కౌలు రైతుల సంక్షేమ నిధికి వినతి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జలమయ్య

అనకాపల్లి రూరల్ : కౌలు రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏపీ కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి.జలమయ్య కోరారు. కౌలు రైతుల రక్షణ, సంక్షేమం కోసం వెంటనే రూ.10 వేల కోట్లతో సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనకాపల్లి సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన కౌలురైతు సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కౌలు రైతులకు తక్షణమే గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కౌలు రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం విశాల హృదయంతో వ్యవహరించాలని అభ్యర్థించారు. భూయజమానులతో సంబంధం లేకుండా పంట రుణాలు మంజూరు చేయించాలని, ఇందుకోసం నిజమైన కౌలు రైతులను గుర్తించే ప్రక్రియ చేపట్టాలని కోరారు. గ్రామ సభల ద్వారా కౌలు రైతుల గుర్తింపు త్వరితగతిన పూర్తిచేసి అన్ని సంక్షేమ పథకాలకు అర్హులుగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా కౌలు రైతు సంఘం నేతలు పాల్గొన్నారు.

ఘనంగా కామాక్షిదేవీ అమ్మవారి కల్యాణం



కల్యాణోత్సవం సందర్భంగా అన్నదానం

మునగపాక : మండలంలోని నాగులాపల్లిలో ఆదివారం కామాక్షి దేవి అమ్మవారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య నిర్వహించిన కల్యాణం తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని పలువురు భక్తులు దర్శించుకున్నారు. దీనిలో భాగంగా బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు భారీగా హాజరయ్యారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మంచి పుస్తకాలే ఉత్తమ స్నేహితులు



విద్యార్థులకు వివిధ అంశాల పై అవగాహన కల్పిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు

పాయకరావుపేట : మంచి పుస్తకాలే ఉత్తమ స్నేహితులని, ప్రతి విద్యార్థి మంచి పుస్తకాలను చదివి, అందులోని మంచిని, నీతిని అవగాహన చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని విశ్రాంత ఉపాధ్యాయులు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు పలు అంశాల పై విశ్రాంత ఉద్యోగులు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ఉత్తమమైన విద్యతో పాటు నీతి కథలు, నీతి వాక్యాలపై అవగాహన కలిగి వుండాలన్నారు. అదే విధంగా ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహిస్తూ నిత్యం పుస్తక పఠనం ఎంతో మంచి కార్యక్రమం అన్నారు. అదే విధంగా వ్యాయామం, యోగా, క్రీడల పట్ల అవగాహన కలిగి వుండాలన్నారు. తెలుగు, ఇంగ్లిషు భాషలు చదవడం, రాయడం, బోధించడం పై ఆసక్తి కలిగి వుండాలన్నారు. అదే విధంగా ప్రతి విద్యార్థి కూడా చరిత్ర పఠనంతో పాటు ఆధ్యాత్మిక పరమైన శ్లోకాలను కూడా చదవడం నేర్చుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారి వామాల లక్ష్మణరావు, పలువురు విశ్రాంత ఉపాద్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవరచుకోవాలి



పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): పుస్తక పఠనం ద్వారా ఎన్నో కొత్త విషయాలు, నీతి, నియమాలు తెలుస్తాయని రిసోర్స్ పర్సన్ సురేంద్ర అన్నారు. అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా 28వ రోజైన ఆదివారం ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలని సూచించారు. గ్రంథాలు, శతకాలు, పద్యాలు చదవాలని సూచించారు. లైబ్రేరియన్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.